జీహెచ్ఎంసీలో ఇంజినీర్లకు స్థాన చలనం

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో పలువురు ఇంజినీర్లకు స్థానం చలనం కల్పిస్తూ జీహెచ్ఎంసీ సీఈ (పీ అండ్ ఏ) గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరికి నాలుగైదు బాధ్యతలు, ఒకే స్థానంలో ఎక్కువ కాలంగా పనిచేస్తున్న ఇంజినీర్లను బదిలీ చేశారు. సీఈ (నిర్వహణ) బాధ్యతలు నిర్వర్తిస్తున్న భాస్కర్ రెడ్డికి ప్రాజెక్టు అండ్ అడ్మిన్ బాధ్యతలకు పరిమితం చేశారు. ఖైరతాబాద్ జోన్‌లో ఉన్న ఎస్ఈ సహదేవ్ రత్నాకర్‌కు ఎఫ్ఏసీగా నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సీఈల బాధ్యతల మార్పులతో పాటు ఎస్ఈలు, ఈఈ, డిప్యూటీ ఈఈలను జోనల్ నుంచి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. 11 మంది ఇంజినీర్ల బదిలీలలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఇంజినీర్లకు ప్రాధాన్యత పోస్టులు దక్కుతున్నాయని తెలంగాణ ప్రాంత ఇంజినీర్లు ఆరోపిస్తున్నారు.

గ్రేటర్ 38.0 డిగ్రీలు

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మొన్నటి వరకు కొంత తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు గురువారం ఒక్కసారిగా 40 డిగ్రీలకు చేరువగా నమోదయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.2డిగ్రీలు, గాలిలో తేమ 22శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఉప్పు నీళ్లే తాగుతున్నం

జర మంచి నీళ్లివ్వండి

- నగరవాసులకు నీటి గోస
- వారంరోజులుగా నీళ్లు రాక అవస్థలు
- ట్యాంకర్లకు ఆర్థిక స్థోమత లేదని ఆవేదన
- పార్కుల్లో అడుగంటిన బోర్లు
- పట్టించుకోని అధికారులు

జూబ్లీహిల్స్ రోడ్ నం 5లోని జీహెచ్ఎంసీ పార్కులో ట్యాంకర్ల ద్వారా పచ్చికను తడుపుతున్న సిబ్బంది

సిటీ బ్యూరో/మియాపూర్/ దుండిగల్/ బంజారాహిల్స్, మార్చి 13,(నమస్తే తెలంగాణ): విశ్వనగరంగా అభివృద్ధి చెందాల్సిన మహానగరంలో తాగునీటి కోసం నగరవాసులు గోస పడుతున్నారు. వారం రోజుల నుంచి ఉప్పు నీరే తాగుతున్నాం.. జర మాకు మంచి నీళ్లు ఇవ్వండి సారూ' అంటూ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. మియాపూర్, దుండిగల్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఇటువంటి దుస్థితి నెలకొంది. ప్రజా పాలన ఇది అని డాంబికాలు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వీరి సమస్య కనబడకపోవడం శోచనీయం. ట్యాంకర్లు బుక్ చేద్దామనుకుంటే అంత స్థోమత లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పు నీళ్లు తాగలేక.. గొంతు దాహం తీరక జనం నానా అవస్థలు పడుతున్నారు. అయినా అక్కడి అధికారులు రెండు రోజులు, మూడు రోజులు అంటూ వారం దాటినా సమస్య పరిష్కరించకుండా వదిలేశారు.

పార్కుల్లో నీటి కష్టాలు...

వేసవికాలం సమీపిస్తున్నకొద్ది నీటి కష్టాలు ముంచుకు వస్తున్నాయి. పలు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోతున్న సంగతి తెలిసిందే. కాగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ పార్కుల్లో సైతం నీటి కష్టాలు మొదలయ్యాయి. జీహెచ్ఎంసీ సర్కిల్ 18 పరిధిలోని పలు పార్కుల్లో గతంలో వేసిన బోర్లు ఎండిపోవడంతో మొక్కలు కాపాడేందుకు ట్యాంకర్ల మీద ఆధారపడాల్సి వస్తోంది. జూబ్లీహిల్స్ రోడ్ నెం 5లోని జీహెచ్ఎంసీ పార్కులో బోరు ఎండిపోవడంతో నెలరోజులుగా మొక్కలకు నీటిని పట్టేందుకు జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. పార్కులోని బోర్ మోటర్‌ను బయటకు లాగి చూడగా చుక్కనీరు లేనట్లు తేలింది.

ట్యాంకర్లతో నీళ్లు

గ్రేటర్, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శాసన మండలిలో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో తాగునీరు, ఇతర సమస్యలపై ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాల ముందు ఉన్నటువంటి పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ కనిపిస్తుందని, ఎక్కడా చూసినా తాగునీటి ట్యాంకర్లు, ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. తాగునీటి సమస్య నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి సరఫరా సరిగా లేక ప్రభుత్వం సప్లై చేయలేని క్రమంలో ప్రజలు ట్యాంకర్లు కొంటున్నారని సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

తాగునీటికి నానా అవస్థలు

ఎండలు మండిపోతుండడంతో తాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయి. వారం రోజులు గా కాలనీ లో తాగునీటి సరఫరా నిలిచిపాయింది. కేవలం రెండు రోజుల అంతరాయం అని చెప్పి వారం రోజులపాటు తాగునీరు ఇవ్వక పోతే గొంతు తడుపు కునేది ఎట్లా? కాలనీలో ప్రజలు తాగునీటి కి నానా అవస్థలు పడుతున్నారు. ట్యాంకర్లు బుక్ చేసుకునే స్థోమత లేక ఉప్పు నీటినే తాగుతున్నారు. అధికారులకు చెప్పినా ఫలితం లేదు.

– నాగేశ్వరరావు, భాగ్యనగర్ కాలనీ ఫేస్ 3 ప్రెసిడెంట్

వారం రోజులుగా నీళ్లు లేవు

మా కాలనీ లో వారం రోజులపాటు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పత్రికల్లో రెండు రోజులే అని చెప్పి, వారం రోజులైనా నీరు రాలేదు. స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ప్రజల అవసరాన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ ట్యాంకర్ల వారు డబ్బులు దండుకున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి చూడలేదు. పేమెంట్ ట్యాంకర్లు సైతం డిమాండ్ ఉండటంతో ఆలస్యంగా డెలివరీ అవుతున్నాయి.

– శ్రీధర్, భాగ్య నగర్ ఫేస్ 3 సంఘం సలహాదారు

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

సంస్థాన్ నారాయణపురం : కవయిత్రి మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘం నాయకులు

చౌటుప్పల్, మార్చి 13 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తొలి మహిళా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిలువేరు నర్సింహ, ఊషయ్య, వెంకటేశం, గాలయ్య, విజయ్‌కుమార్, ముత్యాలు, సత్తయ్య పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల 585వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సిలువేరు నర్సింహ, సిలువేరు అంజయ్య, బొడ్డుపల్లి గాలయ్య, వీరేశం, జంగయ్య, వెంకటేశ్, సంజీవ, శంకర్, సాయిబాబు, సైదులు పాల్గొన్నారు.

గుట్టలో కామ దహనం

యాదగిరిగుట్టలో కాముని దహనం చేస్తున్న ఆలయ సిబ్బంది

యాదగిరిగుట్ట, మార్చి 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన స్వాగత తోరణం వద్ద ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం కామ దహనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీటి సమస్య తీర్చాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

చౌటుప్పల్, మార్చి 13 : పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చాలని కోరుతూ కాలనీవాసులు గురువారం మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో కొన్ని రోజులుగా నీటి సరఫరా కావడం లేదని పేర్కొన్నారు. ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తెప్పించుకోవడం భారంగా మారిందని తెలిపారు. తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రామ కంఠం భూమిని కాపాడాలి

కొండగడపలో ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న తానీల్దార్ కార్యాలయ అధికారులు

మోత్కూరు, మార్చి13 : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపలో గ్రామ కంఠం భూమిని ఆక్రమించి జేసీబీతో చెట్లను తొలగించి చదును చేసిన గ్రామానికి చెందిన కొప్పుల అశోక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గురువారం మున్సిపల్, తాసీల్దార్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు క్షేత్ర పరిశీలన చేశారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు ఆర్ఐ జె.సుమన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సుమన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ సభ్యులు

భువనగిరి అర్బన్, మార్చి 13 : పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, గంజ్ హైస్కూల్, భగాయత్ హైస్కూల్‌తోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో 7నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు డాక్టర్ ఎంపల్ల బుచ్చిరెడ్డి సౌజన్యంతో అందజేసిన 15 సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు హనీఫ్ మెమన్ మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ మాజీ అధ్యక్షుడు పక్కీరు కొండల్‌రెడ్డి, సభ్యులు ఎండీ ఇంతియాజ్, గుమ్ముల మల్లేశం, ఉపాధ్యాయురాలు ఫాతిమా, రేణుక, సబిత, ఝాన్సీ, రజిత, శైలజ పాల్గొన్నారు.

పోచంపల్లిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, మార్చి 13 : పట్టణంలోని 5, 6 వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ అన్నారు. పట్టణంలోని 5, 6 వార్డుల్లో గురువారం నాయకులు సందర్శించారు. వార్డులకు సంబంధించిన మురుగు నీరు రోడ్డు పైకి వచ్చి చెరువులా తలపిస్తుందన్నారు. దాంతో విపరీతమైన దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, నాయకులు మధు, యాదగిరి, కృష్ణ, మల్లారెడ్డి, కృష్ణ, అనసూయ, శ్రీరాములు, కిష్టయ్య, వీరభాను పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ఓ పిచ్చికుక్క

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నోరు పారేసుకుంటే సహించం

ఓయూలో వినూత్నంగా నిరసన

వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రేవంత్ రెడ్డి పిచ్చి కుక్కలాగా కేసీఆర్ పై నోరు పారేసుకుంటే సహించమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కందుల మధు, విజయ్‌రావు హెచ్చరించారు. కేసీఆర్ ను మార్చురీకి పంపిస్తామని రేవంత్ అనడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉస్మానియా యూనివర్సిటీలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి రేబీస్ వ్యాక్సిన్ ఇంజక్షన్ చేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయి మరిచిపోయి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నోరు పారేసుకుంటున్నాడని మండిపడ్డారు. కేసీఆర్ పదవిలో ఉన్నా, లేకపోయినా నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల గుండెల్లో ఉంటారని తెలిపారు. ఆయనపై అవాకులు,చెవాకులు పేలితే సహించబోమన్నారు. రేవంత్ రెడ్డి మతిస్థిమితం కోల్పోయాడని ధ్వజమెత్తారు. రేవంత్ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. విద్యార్థి నాయకులు కొట్టాల యాదగిరి, రవి కిరణ్, మురళి, అనిల్, వర్ధన్, అభి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి పతనం ఖాయం: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి సీఎం రేవంత్ అడుగులు వేస్తున్నాడని, రేవంత్ పతనానికి ఇదే నాంది అవుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ కుటుంబంపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కేసీఆర్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నాడని అన్నారు. రాష్ట్ర ప్రగతి, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్క దారి పట్టించేందుకే కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నాడని ఆరోపించారు.

రాష్ట్రంలో మెరుగ్గా అంబులెన్స్ సౌకర్యం

కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, ఈఎంఎల్‌సీ డైరెక్టర్ జీవీ రమణారావు

శామీర్‌పేట, మార్చి 13 : రాష్ట్రంలో వైద్య సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్ అన్నారు. ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌లో భాగంగా రిసాసిటేషన్ అకాడమీని మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని ఈఎంఆర్ఐ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అంబులెన్స్ లభ్యత మెరుగ్గా ఉందన్నారు. జాతీయ సగటు ప్రకారం ప్రతి లక్ష మందికి ఒక బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్) అంబులెన్స్ నిష్పత్తిని సిఫార్సు చేస్తున్నప్పటికీ, తెలంగాణలో ప్రస్తుతం ప్రతి 64,500 మందికి ఒక అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. 50 వేల మంది పౌరులతో పాటు రాష్ట్రంలోని పోలీసు సిబ్బంది సీపీఆర్‌లో శిక్షణ పొందారని తెలిపారు. అన్ని విద్యాసంస్థలు సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈఎంఆర్ఐ ద్వారా నిర్వహిస్తున్న 108 అంబులెన్స్‌లు ఉన్నతంగా సేవలు అందిస్తున్నాయని ఎమర్జెన్సీ మెడిసిన్ లెర్నింగ్ సెంటర్, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.రమణరావు అన్నారు. కార్యక్రమంలో రిసాసిటేషన్ అకాడమీ ఫౌండేషన్, యూఎస్ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆన్ మిచెల్ డాల్, ప్రీ–హాస్పిటల్ ఎమర్జెన్సీ కేర్ యూనిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మార్కస్, సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, లార్డాల్ ఫౌండేషన్ ప్రతినిధి టోర్ లార్డాల్, పునరుజ్జీవన అకాడమీ ఫౌండేషన్, యూఎస్ఏ ఈడీ ప్రొఫెసర్ రాబర్ట్ న్యూమార్, మిచిగాన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఫ్రెడ్డీ లిప్పర్ట్, డెన్మార్క్ యూనివర్శిటీ డాక్టర్ ఇవాన్ చువా తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ పై అవగాహన

మేడ్చల్ రూరల్ : దేశంలో ఆకస్మిక కార్డియాక్ అరెస్టుల్లో మనుగడ రేటును మెరుగు పరిచేందుకుగాను ఈఎంఆర్ఐ లో దేశంలోనే మొట్టమొదటి పునరుజ్జీవన అకాడమీని ప్రారంభించినట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్ తెలిపారు. మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయంలో గురువారం సీ పీ ఆర్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయంలో దేశంలోనే మొట్టమొదటి పునరుజ్జీవన అకాడమీ స్థాపించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఇలాంటి 30 అకాడమీలు ఉన్న ఇతర దేశాలలో భారతదేశం చేరిందని అన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి : సీపీఎం

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, మార్చి 13 : రాఘవాపురం నుంచి ఎర్రబెట్టు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా రాఘవాపురంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 మార్చి 23న పనులు ప్రారంభించి 2024 సెప్టెంబర్ 9వరకు పూర్తిచేయాలని ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.3.17 కోట్లతో టెండర్ దక్కించుకున్న రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ 2ఏండ్లు అయినా పనులు పూర్తి చేయకుండా నిర్లక్షం చేస్తున్నారన్నారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, లక్ష్మీదేవి గూడెం గ్రామ మాజీ సర్పంచ్ ధర్మ బస్వారెడ్డి, నాయకులు మేకల బాలయ్య, కందాడి దేవేందర్‌రెడ్డి, మంద కిరణ్‌కుమార్, బాలయ్య, భిక్షపతి, బాలకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సీపీఎం పోరుబాటను జయప్రదం చేయాలి'

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వలిగొండ, మార్చి 13 : సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 28వరకు చేపట్టనున్న పోరుబాటను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు లేదని, పారిశుధ్యం పడకేసిందని, సంక్షేమ పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, కందాడి సత్తిరెడ్డి, పైళ్ల గణపతిరెడ్డి, మెరుగు వెంకటేశం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, గోపాల్, ముత్యాలు, యాదయ్య పాల్గొన్నారు.

నూతన పద్ధతుల్లో బోధన చేయాలి

భువనగిరి అర్బన్, మార్చి 13 : విద్యార్థుల అభివృద్ధికి నూతన పద్ధతుల్లో బోధన చేయాలని రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ గంటి అప్పలనర్సింహ అన్నారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం మెంటరింగ్ బై ఎమినెంట్ ఎక్స్‌పర్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధించే విధానంలో మార్గనిర్దేశాన్ని ఉపాధ్యాయులకు సూచించారు. బోధనలో నైపుణ్యాల పెంపుపై అవగాహన కల్పించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన పద్ధతులపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.చంద్రమౌళి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె దవాఖానలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం నేత దాసరి పాండు

బొమ్మలరామారం, మార్చి 13 : పల్లె దవాఖానలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండలంలోని మర్యాల గ్రామంలో గురువారం పల్లె దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె దవాఖానలో డాక్టర్ల కొరత, సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పల్లె దవాఖానకు నిధులు కేటాయించి ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు ప్యారారం వెంకటేశం పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బందులు

- ఈఎన్‌టీ ఆసుపత్రిలో అరకొర సిబ్బంది
- వైద్యరంగాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్
- ఖాళీలు భర్తీ చేయకుండా కాలయాపన
- ఇబ్బందులు పడుతున్న రోగులు

కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రి

సిటీబ్యూరో, మార్చి13,(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తి స్థాయిలో విస్మరించింది. కేసీఆర్ సర్కార్ వైద్యానికి పెద్దపీట వేస్తే, రేవంత్ ప్రభుత్వం దాన్ని కాలరాస్తుంది. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వాసుపత్రిలో చూసినా సిబ్బంది కొరత వెంటాడుతుంది. సకాలంలో వైద్యమందించేవారు లేక రోగులు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర రాజధానిలో ఉన్న ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రిలో సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యమైన విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న వారి మీదే అధిక ఒత్తిడి తెస్తున్నారు.

రోగుల తాకిడి ఎక్కువే..

హైదరాబాద్‌లో ఉన్న ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుంచి సైతం రోగులు వస్తుంటారు. ప్రతి సోమవారం సుమారు 2000 మంది వరకు ఔట్ పేషెంట్లు రాగా, మిగతా రోజుల్లో 1500 వరకు వస్తుంటారు. 125 మంది వరకు ఇన్ ఫేషెంట్లుగా చికిత్స పొందుతుండటం గమనార్హం. ప్రభుత్వాసుప్రతి కావడంతో రోగుల తాకిడి అధికమనే చెప్పాలి. కానీ సరిపడా సిబ్బంది లేక వైద్యం కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

పనిభారం తగ్గించాలి...

ప్రస్తుత రోజుల్లో ఈఎన్‌టీకి రోగుల తాకిడి ఎక్కువైతుంది. దీనిలో భాగంగా ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం చాలా ఉంది. రెండు రేడియోగ్రాఫర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా వాటిని భర్తీ చేయకపోగా ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారు. అదేవిధంగా నాలుగు ఫార్మాసిస్టు .పోస్టులు ఖాళీగా ఉండటంతో ఒక ఉద్యోగి కాంట్రాక్ట్ పద్ధతిలోనే సేవలందిస్తున్నారు. మిగతా ఖాళీల ఊసే లేదు. సరిపడా సిబ్బందిలేక పోవడంతో ఉన్నవారితోనే పనిచేయించడం వల్ల పని ఒత్తిడికి గురవుతున్నారు. సరిపడా సిబ్బందిని నియమించి పనిభారం తగ్గించాలని వైద్యులు వేడుకుంటున్నారు. మరోవైపు సిబ్బంది కొరత లేకుండా సత్వర వైద్యం అందించాలని రోగులు, బంధువులు అభిప్రాయపడుతున్నారు.

భర్తీ చేయాల్సిన ఖాళీలు

రేడియోగ్రాఫర్	2
డార్క్‌రూమ్	4
ఫార్మసిస్టు	4
ప్రొఫెసర్	3
అసిస్టెంట్ ప్రొఫెసర్	2
నర్సింగ్ ఆఫీసర్	11
సీనియర్ అసిస్టెంట్	2
థియేటర్ అసిస్టెంట్	2
ఆడియాలిస్ట్	1
ఆడియాలజీ టెక్నీషియన్	2
నాలుగో తరగతి ఉద్యోగులు	28